సాక్షి
ములుగు

బుధవారం । 1 । మార్చి । 2023



పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష...
కేయూలోని 28 విభాగాల్లో పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశ పరీక్ష ఫలితాలను వీసీ రమేశ్, పరీక్షల, నియంత్రణాధికారి మల్లారెడ్డి విడుదల చేశారు.
- 8లో▸



టాస్క్ ద్వారా ఉద్యోగ...
టాస్క్ ద్వారా శిక్షణతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు టాస్క్ రీజినల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు.
- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0^0 / 19.0^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆటపాటలతో అభ్యసనం చేయాలి



ఏటూరునాగారం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు పిల్లలకు ఆటపాటలతో అభ్యసనం చేయాలని జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి అన్నారు. మండల పరిధిలోని రాంనగర్, లంబాడీతండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారంపై టీచర్లకు ఆమె సూచనలు చేశారు. ప్రభుత్వం నుంచి వస్తున్న బాలామృతం, కురుకురేలు, పాలు, గుడ్లు ఇవ్వాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మినారాయణ, ఈజీఎస్ ఏపీఓ అంకూస్, ఉప సర్పంచ్ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పనులను పకడ్బందీగా చేపట్టాలి



ములుగు రూరల్: గ్రామాల్లో స్వచ్ఛభారత్ పనులను పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీఓ దేవరాజ్ అన్నారు. మండల పరిధిలోని జీవింతరావుపల్లిలో స్వచ్ఛభారత్ మిషన్ ఫేస్ –2లో భాగంగా ఆయన మంగళవారం పర్యటించి మాట్లాడారు. గ్రామాల్లో డ్రైనేజీ నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, ఇంకుడుగుంతలు, ప్లాంటేషన్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో వీధులు, ఇంటింటా సర్వే నిర్వహించారు. మరుగుదొడ్ల నిర్మాణంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఇక్బాల్, సర్పంచ్ రత్నం భద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఇమ్మడి దామోదర్, స్వచ్ఛ భారత మిషన్ కో ఆర్డినేటర్ మున్నీస్వా, ఎంపీఓ రహిమోద్దీన్ పాల్గొన్నారు.

నూరుశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలి



వెంకటాపురం(కె): మండలంలో నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని డీపీఓ వెంకయ్య అన్నారు. మండల పరిధిలోని వీఆర్‌కే పురం పంచాయతీలో ఆయన మంగళవారం పర్యటించారు. వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లలో పంచాయతీ సిబ్బంది వందశాతం వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. వెంకటాపురం పంచాయతీ నూరుశాతం వసూళ్లకు దగ్గరలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల తరలింపు అడ్డగింత

వెంకటాపురం(కె): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి బొలెరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న పశువులను మండల పరిధిలోని సూరవీడు గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చర్ల మండలం నుంచి మూడు బొలెరో వాహనాల్లో సుమారు 40పశువులను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. సూరవీడు గ్రామస్తులు లారీలో మిర్చి బస్తాలను లోడ్ చేస్తుండగా పశువులను తరలిస్తున్న ఓ బొలెరో వాహనం లారీకి వెనుకభాగంలో తగిలించి వెళ్తోంది. దీంతో గ్రామస్తులు వాటిని అడ్డుకున్నట్లు తెలిపారు. అక్రమంగా పశువుల తరలిస్తున్న విషయాన్ని పోలీసులకు సమాచారం అందించి మూడు వాహనాలతో పాటుగా మరో కారును గ్రామస్తులు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.



బీఆర్‌ఎస్ నాయకులు ఉన్న ఊర్వశి థియేటర్‌పైకి రాళ్లు విసురుతున్న కాంగ్రెస్ శ్రేణులు, థియేటర్ నుంచి బయటికి వస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

దాడులు.. ప్రతిదాడులు!

ఉదయం నుంచి భూపాలపల్లిలో ఉద్రిక్తత ● ఫ్లెక్సీ కటౌట్‌తో మొదలైన రగడ.. రేవంత్ బహిరంగ సభ దాకా కొనసాగింపు

- టమాటాలు, కోడిగుడ్లు, రాళ్లతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల దాడి
- చేతులెత్తేసి వాహనాల చాటున తలదాచుకున్న పోలీసులు
- దాడిలో ఓ ఎస్సైకి గాయాలు, పగిలిన థియేటర్ అద్దాలు

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి జిల్లాకేంద్రం రణరంగమైంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల దాడులు, ప్రతిదాడులతో ఉదయంనుంచి ఉద్రిక్తత నెలకొంది. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కటౌట్‌తో మంగళవారం ఉదయం ప్రారంభమైన గొడవ రాత్రి వరకు తారస్థాయికి చేరింది. సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు, రాళ్లు, చెప్పులు, కోడిగుడ్లు, టమాటాలతో దాడులు, ప్రతిదాడులు చేసుకున్నాయి. పోలీసులు చేసేది లేక వాహనాల చాటున తల దాచుకునే పరిస్థితి నెలకొంది. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం భూపాలపల్లి పట్టణంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు ఆయనకు స్వాగతం పలుకుతూ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్న అంబేడ్కర్ చౌరస్తాలో కటౌట్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని తమ పార్టీ కటౌట్ ఎదుట కాంగ్రెస్ కటౌట్ ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య మూడు గంటల పాటు మాటల యుద్ధం కొనసాగింది. విషయం తెలుసుకున్న ఇరు పార్టీల స్థానిక నాయకులు సంఘటన స్థలానికి చేరుకోగా గొడవ పెద్దదై తోపులాడుకున్నారు. రెండు వర్గాల నాయకులు బాహాబాహికి దిగి గల్లలు పట్టుకొని కొట్టుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అయినప్పటికీ ఎవరూ అక్కడినుంచి ఉపక్రమించలేదు. బీఆర్‌ఎస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారంటూ, ఎమ్మెల్యే గండ్ర డౌన్ డౌన్, పోలీసులు డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు రాస్తారోకోకు దిగారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు సాగర్ సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు బుజ్జగించడంతో ఇరు పార్టీలు అక్కడినుంచి వెళ్లిపోయాయి.



రాళ్ల బారినుంచి తలదాచుకుంటున్న పోలీసులు



ఎస్సైని పరామర్శిస్తున్న ఎస్పీ సురేందర్‌రెడ్డి

14 నిమిషాల పాటు రాళ్ల వర్షం..

ఉదయం జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని రాత్రి జరగనున్న రేవంత్‌రెడ్డి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. మీటింగ్ జరిగే స్థలం పక్కనే ఉన్న ఊర్వశి థియేటర్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు టమాటలు, కోడిగుడ్లతో రేవంత్ మీటింగ్‌పై దాడికి పాల్పడే అవకాశం ఉందని పోలీసులకు సమాచారం అందింది. ముందస్తుగా థియేటర్‌వద్ద సుమారు 50 మంది పోలీసులు బందోబస్తుగా ఉన్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతున్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేసుకుంటూ పోలీసులను తోసుకుంటూ బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా లాఠీలతో అడ్డుకున్నారు. రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభం కాగానే బీఆర్‌ఎస్ నాయకులు చెప్పులు, టమాటాలు, కోడిగుడ్లు విసిరారు. ఈ విషయాన్ని గమనించిన కాంగ్రెస్ నాయకులు ఎవరూ ఊహించని రీతిలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్న థియేటర్‌పైకి రాళ్ల వర్షం కురిపించారు. క్షణక్షణానికి పదుల సంఖ్యలో రాళ్లు వస్తుండటంతో చేసేది లేక థియేటర్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులు, వెంటనే లోపలికి వెళ్లిపోయారు. థియేటర్ బయట ఉన్న పోలీసులు వాహనాల చాటున తలదాచుకున్నారు. సభకు హాజరైన పాత్రికేయులు, ఇతరులు పరుగులంకించుకున్నారు. సుమారు 14 నిమిషాల పాటు రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో కాటారం ఎస్‌ఐ శ్రీనివాస్ తలకు గాయమైంది. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌ఐని ఎస్పీ సురేందర్ రెడ్డి పరామర్శించారు.

కాలనీలు తిరుగుతూ.. ఆప్యాయంగా పలకరిస్తూ..

భూపాలపల్లి మున్సిపాలిటీలో కొనసాగిన రేవంత్ జోడోయాత్ర

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగింది. రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి పట్టణంలోని కాశీంపల్లికి చేరుకొని బస చేశారు. మంగళవారం ఉదయం 7 గంటలకు కేటీకే 5వ గనిపై గేట్ మీటింగ్‌లో పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం తిరిగి కాశీంపల్లికి చేరుకొని తన శిబిరంలో విద్యార్థి, యువజన, మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటలకు విలేకరులతో చిట్‌చాట్ చేశారు. సాయంత్రం 5 గంటలకు కాశీంపల్లి నుంచి యాత్ర మొదలైంది. సెగ్గంపల్లికి చేరుకుని ఆయన అక్కడే ఎదురైన వృద్ధులతో మాట్లాడారు. అక్కడినుంచి జంగేడుకు చేరుకుని గుడిసెవాసి కొత్తపల్లి సరోజన ఇంటికి వెళ్లారు. వారితో మాట్లాడి కష్టాలు తెలుసుకున్నారు. ఆ తరువాత బయటికి వచ్చి వారసంతను పరిశీలించారు. కూరగాయలు అమ్ముతున్న మహిళతో ధరలు ఎలా ఉన్నాయి.. వ్యాపారం సాగుతుందా అని తెలుసుకున్నారు. ఆ తరువాత ఫక్కీర్‌గడ్డ, కాకతీయకాలనీ, రాంనగర్, సుభాష్‌కాలనీ, ఎల్‌బీనగర్, శాంతినగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌గాంధీ చౌక్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. కాలనీల్లో మహిళలు హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, మల్లు రవి, అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క, నాయకులు వేం నరేందర్‌రెడ్డి, జనక్‌ప్రసాద్, అయిత ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, పుప్పాల రాజేందర్, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో కూరగాయలు అమ్ముతున్న మహిళతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



భూపాలపల్లి సభలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సత్యనారాయణ తదితరులు

రామప్పను సందర్శించిన ప్రముఖులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పొన్నాల లక్ష్మయ్య

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి, బిల్ గేట్స్ పర్సనల్ సెక్రటరీ శ్రీరంగ శ్రీహరి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్లు వారికి స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. రామలింగేశ్వర స్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి స్వామి వారి శేషవస్త్రాలను బహుకరించారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ అద్భుతంగా ఉందని వారు కొనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట మాజీ డిప్యూటీ మేయర్ ఎం బడి రవీందర్, తోట హరీశ్, పోలీస్, టూరిజం, దేవాదాయ శాఖల సిబ్బంది ఉన్నారు. అదే విధంగా రామప్ప దేవాలయాన్ని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సందర్శించారు. రామప్ప రామలింగేశ్వర స్వామికి ఆయన పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్ రావు, కొండ నిరంజన్, తదితరులు ఉన్నారు.

ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

ములుగు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం అని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో పార్టీ సభ్యత్వం తీసుకొని మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు మంగళవారం రూ.12లక్షల విలువగల ఇన్సూరెన్స్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. జిల్లాలో త్వరలోనే మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారని తెలిపారు. మండలాల వారీగా సన్నాహక సభలు నిర్వహించి విజయవంతం చేసేలా చూడాలని మండలాల బాధ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు, మంగపేట, ఏటూరునాగారం మండలాల అధ్యక్షులు బాదం ప్రవీణ్, కుడుముల లక్ష్మీనారాయణ, గడదాసు సునీల్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, చిక్కుల రాములు, ముకుందం, సురేందర్, మల్లారెడ్డి, ఖాజాపాషా, కోగిల మహేశ్, సమ్మయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు త్వరితగతిన పంపిణీ చేయాలి

ములుగు రూరల్: కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకొని దూరం చూపు అద్దాల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు అద్దాలను త్వరితగతిన పంపిణీ చేయాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని దేవగిరిపట్నంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లో 40 సంవత్సరాలు పైబడిన వారిని శిబిరాల్లో పరీక్షలకు తీసుకురావాలన్నారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి తప్పని సరిగా కంటి పరీక్షలు చేయించాలని ఆశ వర్కర్లను ఆదేశించారు. దూరపు చూపు కంటి అద్దాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

అధికారుల పల్లెనిద్ర

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని గంగారంలో డీఎంహెచ్‌ఓ, మండల స్పెషలాఫీసర్ అప్పయ్య, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఎంపీఓ శ్రీధర రావు మంగళవారం పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా జీపీ కార్యాలయంలో సర్పంచ్ నాగేశ్వర రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామంలోని చెరువుల పూడిక పనులు, కాల్వల మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. తాగునీటి కొరతపై ఆరా తీశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పల్లె నిద్ర చేసిన అధికారులు బుధవారం గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి మధుచందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య
- జిల్లా కేంద్రంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు

ములుగు: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సేవాలాల్ ఆలయంలో సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం కిషన్ మహరాజ్ సమక్షంలో భోగ్, భండారో సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి వెంబడి సంప్రదాయ దుస్తులతో మహిళలు, పాక్‌డీలతో పురుషులు వందలాదిగా తరలివచ్చారు. కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఏటూరునాగారం పీఓ అంకిత్, గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్‌లు మహిళలతో కలిసి లంబాడ నృత్యం చేశారు. అనంతరం సేవాలాల్ మహరాజ్, మేరామ యాడీలను కలెక్టర్, పీఓ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంక్షలతో కూడిన సమాజంలో ఎన్నో అవరోధాలను అధిగమించి గొప్ప సంఘ సంస్కర్తగా ఎదిగిన మహనీయుడు సేవాలాల్ అన్నారు. సేవాలాల్ పరమపదించి రెండు వందల సంవత్సరాలు దాటినా నేటికీ దేవుడిగా భావించి కొలుస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు ఎంత గొప్పవో అర్థం అవుతున్నాయని తెలిపారు. సేవాలాల్‌ను దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ భాషా, వేషాధారణ, కట్టుబాట్లను కాపాడుకున్నప్పుడే జాతికంటూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. బంజారా జాతి అభ్యున్నతికి సేవాలాల్ 22 సూత్రాలను అందించారని వాటిని అనుసరించాలని సూచించారు. గిరిజన, లంబాడీలలో మార్పు రావాలంటే విద్య, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం పీఓ అంకిత్ మాట్లాడుతూ సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలన్నారు. మహనీయుల అడుగుజాడల్లో నడిచి ఆదర్శంగా జీవించాలని సూచించారు. బంజారాల వేషధారణ బట్టలు కుట్టుకోవడానికి టైలరింగ్ యూనిట్‌ను మంజూరు చేశారు. అంతకుముందు ముఖ్య అతిథులను కమిటీ నిర్వహణ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఎంపీపీ శ్రీదేవిసుధీర్, ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఎస్‌ఓ రాజ్‌కుమార్, హార్టికల్చర్ అధికారి రమణ, డిప్యూటీ ఎస్‌ఓ లాల్‌నాయక్, ఏటీడీఓ దేశిరాంనాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జయరాంనాయక్, ప్రధాన కార్యదర్శి సునీల్‌నాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.



లంబాడీలతో నృత్యం చేస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీఓ తదితరులు



భోగ్ సమర్పిస్తున్న లంబాడీలు, హాజరైన కలెక్టర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట





వృత్తి నైపుణ్యత పరీక్షలకు హాజరైన గిరిజన మత్స్యకారులతో అధికారులు, వల విసురుతున్న మత్స్యకారుడు

మంగపేట: గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పెసా కో ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని చుంచుపల్లి, రామచంద్రునిపేట, బాలన్నగూడెం గ్రామాల్లోని గిరిజన మత్స్యకారులకు చేపలు పట్టే విధానంపై జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి ఆధ్వర్యంలో వలలు విసరడం, ఈత కొట్టడం, వలలు లాగడం వంటి వృత్తి నైపుణ్యత పరీక్షలను మంగళవారం గోదావరి నదిలో నిర్వహించారు. వృత్తి నైపుణ్యత శిక్షణతో పాటు సొసైటీలో సభ్యత్వానికి నైపుణ్యత పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మత్స్య పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గిరిజన మత్స్యకారులకు ఉచితంగా వలలు, 75 శాతం రాయితీపై సైకిళ్లు, మోటార్ వెహికిల్స్ అందిస్తోందని తెలిపారు. యంత్రాలతో పాటు ఎవరైనా మత్స్యకారులు ప్రమాదవశాత్తు మృతి చెందితే ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు వారి కుటుంబాలకు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి (అబ్జర్వర్) అవినాష్, ఉమ్మడి వరంగల్, సొసైటీ డైరెక్టర్ రవి, మత్స్య శాఖ సిబ్బంది మౌనిక, కృష్ణ, పెసా మొబిలైజర్‌లు పూనెం రఘురాం, సున్నం మధు, యాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

వెంకటాపురం(కె): గ్రామంల్లోకి అపరిచితులు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని, వారి సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలపాలని ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ తెలిపారు. మండల పరిధిలోని కొత్తగుంపు గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చిన్నారులకు కావాల్సిన తినుబండారాలను పంపిణీ చేశారు. అనంతరం ఏఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానికంగా గొడవలు జరిగితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అసాంఘీక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కొత్త వ్యక్తులు గ్రామాలకు వస్తే వారి సమాచారం పోలీసులకు తెలుపాలని సూచించారు. గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో కావాల్సిన సహాయ సహకారాన్ని అందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సీఐ శివ ప్రసాద్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



చిన్నారులకు తినుబండారాలను అందిస్తున్న ఏఎస్పీ సంకీర్త్

ర్యాగింగ్‌ను తరిమేద్దాం





ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలివే..

ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులను తరగతుల నుంచి బహిష్కరించవచ్చు. ఉపకార వేతనాలను నిలిపేయవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు అనర్హుడిగా ప్రకటించవచ్చు. పరీక్షల్లో డీబార్ చేయవచ్చు. అడ్మిషన్‌ను రద్దు చేయవచ్చు. ఒకటి నుంచి మూడేళ్ల వరకు కళాశాల బహిష్కరణ, జరిమానా విధించవచ్చు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయవచ్చు.

- తోటి విద్యార్థులను వేధిస్తే జైలుకే
- జూనియర్లను సోదరులుగా భావించాలి
- అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు

కాజీపేట: ఎన్నో కలలతో ఉన్నత చదువుల కోసం వచ్చిన విద్యార్థులను ర్యాగింగ్ భూతం వెంటాడుతోంది. కొన్ని చోట్ల వారి భవిష్యత్‌నే మింగేస్తోంది. విద్యావ్యవస్థలో సరదా పేరిట వేళ్లూనుకున్న ర్యాగింగ్ వికృత రూపం దాలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్‌ను బుగ్గిపాలు చేస్తోంది. దీనికి భయపడి అనేక మంది ఆదిలోనే చదువులను ఆపేస్తున్నారు. ఇటీవల ర్యాగింగ్ వేధింపులతో ఆత్మహత్యకు యత్నించిన కేఎంసీ పీజీ వైద్య విద్యార్థి ప్రీతినాయక్ మృతి రాష్ట్రాన్ని కదిలించింది. గతంలో నిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికీ చాలా చోట్ల ర్యాగింగ్ గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నా.. విద్యార్థుల భవిష్యత్ నాశనం కావొద్దని, విద్యాసంస్థల పేరు చెడిపోవద్దని పోలీసులు కేసుల నమోదుకు జంకుతున్నారు. ర్యాగింగ్ చేసిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు. అయితే ర్యాగింగ్ నిరోధక చట్టం 1997 ప్రకారం ర్యాగింగ్‌కు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలుంటాయి. నేర తీవ్రతను బట్టి జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది.

కమిటీలు తప్పనిసరి...

ఇంటర్ దాటిన ప్రతీ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. దీన్ని అమలు చేయకుంటే యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈకమిటీలో కళాశాలల డైరెక్టర్లు, అధ్యాపకులు, సీనియర్, జూనియర్ విద్యార్థులుంటారు. ప్రతీ నెలా కమిటీ సమావేశాన్ని నిర్వహించాలి. సీనియర్లు జూనియర్ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారా? అనే విషయాలను కమిటీ ఎప్పటికప్పుడు గమనించాలి. ఈసమావేశాన్ని నిర్వహించిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు నివేదిక అందించాలి. ర్యాగింగ్ జరుగుతున్నా.. పట్టించుకోకుండా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తే ఆయా కళాశాలల యాజమాన్యాలపై కూడా పోలీసులు కేసు నమోదు చేయవచ్చు. అయితే ప్రతీ కళాశాల ప్రాంగణంలోనూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఇలా చేయరాదు..

శారీరకంగా, మానసికంగా విద్యార్థిని ఇబ్బంది పెడితే ర్యాగింగ్‌గానే భావించవచ్చు. ప్రాక్టికల్ జోక్స్ కూడా ర్యాగింగే. క్యాంపస్‌లోనే కాదు, కాంపౌండ్ బయట, బస్సుల్లో, బహిరంగంగా, నాలుగు గోడల మధ్య క్రిమినల్ ఫోర్స్ మాటల ద్వారా గాయపర్చినా, ఇబ్బందికరమైన ఈమెయిల్స్ పంపినా ర్యాగింగ్‌గానే భావిస్తారు.

నిరోధక కమిటీలు ఇలా..

గ్రేటర్ వరంగల్ నగరంలోని పలు కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే ర్యాగింగ్ నిరోధక అవగాహన కార్యక్రమాలను కూడా కళాశాలల్లో నిర్వహించారు. వసతి గృహాల్లో ర్యాగింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రాత్రి పూట ర్యాగింగ్ నిరోధక కమిటీలు హాస్టళ్లను పరిశీలిస్తున్నాయి. కోవర్టులను ఏర్పాటు చేసి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ర్యాగింగ్ నిరోధకానికి ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశాయి.

సదస్సులు ఏర్పాటు చేస్తాం..



ర్యాగింగ్‌కు పాల్పడడం నేరం. దీనిపై కళాశాలల యాజమాన్యాలతో చర్చిస్తాం. యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయించి అవి ఉత్సాహంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తాం. ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే అనర్థాలపై వివరించి విద్యార్థులను చైతన్యపరుస్తాం.

- పి.శ్రీనివాస్, ఏసీపీ, కాజీపేట

సోదరభావం కలిగి ఉండాలి..



సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల సోదరభావం కలిగి ఉండాలి. ర్యాగింగ్ చేస్తే ఎలాంటి శిక్షలు విధిస్తారో ప్రతీ విద్యార్థికి అవగాహన కలిగించాలి. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ధైర్యం కల్పించాలి. ర్యాగింగ్ చేసేవారిని ఉపేక్షించడం మంచిది కాదు.

- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్

పోలీసుల విచారణే కీలకం

- ఎంజీఎంలో సీసీ కెమెరాల పనితీరుపై అనుమానాలు
- ఏసీపీ కిషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ

ఎంజీఎం: సైఫ్ వేధింపులతోనే వైద్య విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె తండ్రి దరావత్ నరేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ, వేధింపులతో ర్యాగింగ్ చట్టం కేసు నమోదు చేసి వరంగల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం ప్రీతి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 9:10 గంటలకు మృతి చెందింది. ఎంజీఎం ఎమర్జెన్సీ ఈఓటీని వరంగల్ ఏసీపీ కిషన్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ప్రీతికి కౌన్సిలింగ్ ఇచ్చిన వైద్యులు, విభాగాధిపతితో ప్రత్యేక దర్యాప్తు చేసి వివరాలు సేకరించారు. పోలీసుల విచారణలో సైఫ్ ప్రీతిని వేధింపులకు గురిచేసినట్లు సెల్‌ఫోన్ చాటింగ్ ద్వారా సాంకేతికంగా నిర్ధారించినట్లు శుక్రవారం సీపీ విలేకరుల సమావేశంలో ధ్రువీకరించారు. ప్రీతి మృతి చెందిన రోజు ఎంజీఎంలోని సీసీ ఫుటేజీల హార్డ్ డిస్క్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈఘటనలో మరిన్ని నిజానిజాలు వెలుగు చూడాలంటే పోలీసుల విచారణ కోసం ప్రీతి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో ప్రీతి ఘటనపై విచారణ పరిస్థితిని తెలుసునేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఏసీపీ స్పందించలేదు.

అనుమానాలు..

ఎంజీఎం ఆస్పత్రిలో సీసీ ఫుటేజీల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో సీసీ ఫుటేజీలు సరిగ్గా పనిచేయడం లేదని.. ఎంజీఎం అధికారులు పోలీసులకు తెలిపిన ఘటనలు అనేకం. గతంలో దొంగతనాలు, పలు కేసుల విషయంలోనూ సీసీ ఫుటేజీలు సరిగ్గా పనిచేయలేదని ఎంజీఎం అధికారులు పోలీసులతో చెప్పారు. కాగా.. ప్రీతి ఘటనలో సీసీ ఫుటేజీలు పోలీసు అధికారులకు ఎంతలా ఉపయోగపడతాయనేది పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

ప్రీతి ఘటనపై కేఎంసీకి నోటీసులు

- యాంటీ ర్యాగింగ్ కమిటీ వాయిదా
- నేడు యథావిధిగా సమావేశం

ఎంజీఎం: సీనియర్ విద్యార్థి వేధింపులతోనే ప్రీతి ఆత్మహత్యకు ఒడిగట్టిందనే విషయంపై ఢిల్లీ యాంటీ ర్యాగింగ్ కమిటీతో పాటు జాతీయ ఉమెన్స్ రైట్ ప్రొటెక్షన్ కమిటీ సీరియస్‌గా పరిగణించింది. ర్యాగింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశంపై నివేదిక సమర్పించాలని కోరింది. ఈక్రమంలో 12 మంది సభ్యులతో కూడిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశం మంగళవారం జరగాల్సి ఉండగా.. వరంగల్ ఏసీపీతోపాటు మరికొందరు సభ్యులు గైర్హాజరవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. బుధవారం యథావిధిగా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. ప్రీతి ఘటనపై యాంటీ ర్యాగింగ్ కమిటీ ఘటన జరిగిన విధానంపై, సైఫ్‌పై నమోదైన కేసులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు కమిటీ ఎన్ఎంసీకి నివేదిక ఇవ్వనుంది.

ఉప సర్పంచ్‌పై సర్పంచ్ అత్యాచారయత్నం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళా ఉప సర్పంచ్‌పై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ అత్యాచారయత్నం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు మహిళా ఉప సర్పంచ్ పొలం పనులు చేస్తుండగా.. సర్పంచ్ అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. జరిగిన విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేయగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈవిషయమై పోలీసులను వివరణ కోరగా.. సర్పంచ్ భార్య, ఉప సర్పంచ్ భర్త ఇరువర్గాలు ఫిర్యాదులు చేశాయని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వివాహిత అదృశ్యం



రచన

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 17వ డివిజన్ వసంతాపురానికి చెందిన వివాహిత కందకట్ల రచన సోమవారం అదృశ్యమైంది. రచనకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఆమె తన పుట్టింట్లో ఉండగా.. తండ్రి, తల్లి ఎంజీఎంకు వెళ్లారు. వచ్చే సరికి ఆమె కనిపించలేదు. రచన తండ్రి అనుమాండ్ల రాంబాబు ఊళ్లో వెతికినా కూతురి ఆచూకీ లభించలేదు. ఆయన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

10న జాతీయ సదస్సు

విద్యారణ్యపురి: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మార్చి 10న హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం, జానపద కళలశాఖ, దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 'జానపద గిరిజన విజ్ఞాన సేకరణ, అధ్యయనం, సమస్యలు - పరిష్కారాలు' అంశంపై సదస్సు జరగనున్నట్లు వారు తెలిపారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించే ఈసదస్సుకు తెలుగు విశ్వవిద్యాలయ వీసీ తంగెడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ భట్టు రమేశ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈసదస్సులో జానపద గిరిజన విజ్ఞాన బహుముఖాలు సేకరణ పద్ధతులు, జానపద గిరిజన విజ్ఞానం పర్యాటక రంగం, గ్రామీణ జానపద విజ్ఞానం ఆవశ్యకత, జానపద గిరిజన కళారూపాలు సోషల్ మీడియా ప్రభావం, జానపద గిరిజన కళారూపాలు పరిరక్షణ, పరిపోషణ వంటి అంశాలపై పరిశోధకులు, అధ్యాపకులు పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. మార్చి 5లోగా.. రిజిస్ట్రేషన్ కోసం వివరాలు పంపాలని పేర్కొన్నారు. వివరాలకు 99891 39136 నంబర్లలో సంప్రదించాలని వెంకన్న కోరారు.

ఏఎస్‌డబ్ల్యూఓపై లైంగిక వేధింపుల కేసు

కమలాపూర్: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూఓ) లక్ష్మణ్‌నాయక్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో వంట మనిషిగా పని చేస్తున్న ఓమహిళా ఉద్యోగిపై ఏఎస్‌డబ్ల్యూఓ లక్ష్మణ్‌నాయక్ గత ఆరు నెలలుగా శారీరకంగా, మానసికంగా లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ప్రతి నెలా మహిళా ఉద్యోగి హాజరు పట్టికను హసన్‌పర్తి ఆఫీస్‌కు తీసుకురమ్మని చెప్పి అక్కడంతా వెళ్లే వరకు ఉండమని సదరు మహిళా ఉద్యోగిని వేధించేవాడు. ఓరోజు లక్ష్మణ్‌నాయక్ హాస్టల్‌కు వచ్చి ఎవరూ లేని సమయంలో మహిళా ఉద్యోగిని లొంగదీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో హాస్టల్ వార్డెన్ రాజన్న, తోటి సిబ్బంది కొంరయ్య, భద్రయ్య రావడంతో ఆమె తప్పించుకుంది. కోరిక తీర్చకపోతే ఉద్యోగం నుంచి తీసివేస్తానని బెదిరింపులకు గురిచేసేవాడని, అతడి వేధింపులు భరించలేక ఓసారి ఆత్మహత్యకు యత్నించిందని తెలిపారు. లక్ష్మణ్‌నాయక్ వేధింపుల నుంచి, తనను రక్షించాలని కోరుతూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైరి నరేశ్‌పై దాడి ఘటనలో ఆరుగురి అరెస్టు

వరంగల్ క్రైం: భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్‌పై దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ మంగళవారం తెలిపారు. హిందూవాహిని, ఏబీవీపీలకు చెందిన సూర్య ప్రకాశ్, ఛత్రపతి శివాజీ, ప్రశాంత్, హరీశ్, సాయిరాంశర్మ, కార్తీక్‌ను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో విద్యార్థి గల్లంతు

- మధ్యాహ్న భోజనం అనంతరం ఈతకెళ్లిన విద్యార్థులు
- కలెక్టర్ ఆదేశాలతో కాలువలో గాలింపు



మురళి



కాలువలో గాలిస్తున్న ఈతగాళ్లు, పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ

కురవి: ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతయ్యాడు. మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన ఇల్లందుల స్వరూప పెద్ద కుమారుడు మురళి కురవి హైస్కూల్‌లో ఏడోతరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే.. ఇంటి నుంచి గ్రామంలోని విద్యార్థులతో కలిసి కాలినడకన బడికి వెళ్లాడు. కురవి హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని జాతీయ జెండాను గీశాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం స్నేహితులతో కలిసి ఈతకోసం ఆట మైదానం నుంచి నర్సరీ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వైపు వెళ్లాడు. కాలువలోకి దిగేందుకు చెట్టుకు కట్టిన తాడు సాయంతో మురళి కాల్వలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు తాడు తెగింది. మురళి కాలువలో పడిపోయాడు. మరో విద్యార్థి చరణ్ గట్టిగా కేకలు వేయడంతో పక్కనే చేనులో ఉన్న రైతులు లింగన్న, సముద్రాల ఉప్పలయ్య గమనించి ఘటనా స్థలికి చేరుకున్నారు. అప్పటికే మురళి నీటి ప్రవాహంలో మునిగి గల్లంతయ్యాడు. పాఠశాల హెచ్ఎం జయసాగర్‌తోపాటు మరికొందరు ఉపాధ్యాయులు కాల్వ వద్దకు వచ్చి పరిశీలించి విషయాన్ని డీఈఓ రామారావు, కురవి ఎస్సై రాముకు వివరించారు.

విస్తృతంగా గాలింపు చర్యలు..

కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతైన విద్యార్థి మురళి కోసం అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. రాత్రి వరకు పలు చోట్ల అగ్నిమాపక శాఖ సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో కాల్వలోకి దిగి వెతికారు. మహబూబాబాద్ ఆర్డీఓ కొమురయ్య, డీఈఓ రామారావు పర్యవేక్షించారు. ఎస్సారెస్పీ డీఈ విజయ్‌బాబు, ఏఈ రాజమణిలు కాలువలో ప్రవహిస్తున్న నీటి ఉధృతిని తగ్గించారు. విద్యార్థి మురళీ కోసం కాంపల్లి నుంచి వెతికేందుకు సాయపడ్డారు. తహసీల్దార్ ఇమ్మానియేల్ తన సిబ్బందితో కాలువ వద్ద వేచి ఉన్నారు.

కొడుకు కోసం తల్లి నిరీక్షణ

అమ్మా బడికి వెళ్లొస్తానంటూ ఇంటి నుంచి బయలుదేరిన కన్నకొడుకు ఎస్సారెస్పీ కాలువలో గల్లంతైన విషయం తెలియడంతో స్వరూప కన్నీంటి పర్యంతమైంది. గ్రామస్తులతో కలిసి ఎస్సారెస్పీ కాలువ వద్దకు చేరుకుని, కొడుకును తలుచుకుంటూ విలపించింది. కాలువలో దొరికిన కొడుకు చెప్పును ముందు పెట్టుకుని స్వరూప విలపించిన తీరు అందరినీ కలచివేసింది.

ప్రాణాలు మింగిన చేపల వేట

చేపల వేటకు వెళ్లిన ఇద్దరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. చేపలు పట్టే క్రమంలో నీటిలో గల్లంతై మత్స్యకారుడు, విద్యుత్ షాక్‌తో మరో రైతు మృతి చెందారు.



రాజు మృతదేహం

గణపురం: చేపల వేటకు వెళ్లి మండలంలోని బుర్రకాయల గూడేనికి చెందిన బైరగాని రాజు(30) సోమవారం సాయంత్రం గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు రాజు గణపురం మండలం గణప సముద్రం(చెరువు)లోకి వెళ్లి గల్లంతయ్యాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతికారు. అప్పటికే రాజు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని వెలికితీశారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.



శ్రీను(ఫైల్)

చేపలు పట్టే క్రమంలో షాక్‌తో..

గార్ల: మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన సిరిమర్తి శ్రీను(52) చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మంగళవారం ఓ రైతు మృతి చెందాడు. శ్రీను గార్ల సమీపంలోని పాకాల ఏటి కింద వరి సాగు చేశాడు. యాసంగి పొలానికి నీళ్లు పెట్టేందుకు ఏటి ఒడ్డున విద్యుత్ మోటారు ఆన్‌చేసి చేపలు పట్టేందుకు నీళ్లలోకి దిగాడు. నీటిలోకి విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- 89 శాతం మంది అభ్యర్థుల ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్: కేయూలోని 28 విభాగాల్లో పీహెచ్‌డీ రెండో కేటగిరి ప్రవేశ పరీక్షల ఫలితాలను ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం వీసీ తాటికొండ రమేశ్, పరీక్షల, నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి విడుదల చేశారు. మూడు నెలల క్రితం పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశ పరీక్షలు నిర్వహించగా.. ఫలితాల విడుదలలో జాప్యం చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు విడుదల చేశారు. మొత్తంగా 2,447 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవగా.. అందులో 2,178 మంది (89 శాతం) మంది ఉత్తీర్ణత సాధించినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఫలితాలను www.kuonline.co.in చూడవచ్చన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న కేయూ వీసీ రమేశ్

అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌ను, పుట్టిన తేదీ ఆధారంగా వారికి వచ్చిన మార్కులు సంబంధిత వెబ్‌సైట్‌లో చూడవచ్చని మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, అడ్మిషన్ల డైరెక్టర్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

టాస్క్ ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పన

- టాస్క్ రీజినల్ మేనేజర్ రామకృష్ణ

హన్మకొండ: టాస్క్ ద్వారా శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు టాస్క్ రీజినల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం హనుమకొండ కిషన్‌పురలోని సిటీ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టాస్క్ రీజినల్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ శిక్షణ, మెలకువలు నేర్పించడంతో పాటు ఉద్యోగ కల్పనకు టాస్క్ ఏర్పాటు చేసిందన్నారు. ఉద్యోగ కల్పనలో భాగంగా సిటీ మహిళా డిగ్రీ కళాశాలలో జెన్‌పాక్ట్ కంపెనీ ద్వారా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ అకాడమిక్ సబ్జెక్టులతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌ను నేర్పిస్తున్నట్లు తెలిపారు. కాలేజీలో చేరిన ప్రతీ విద్యార్థి ఉద్యోగంతో వెళ్లాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ దిశగా విద్యార్థులకు శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. ఈజాబ్ మేళాలో 177 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జెన్‌ప్యాక్ట్ హెచ్‌ఆర్ సామ్సన్, కళాశాల ప్రిన్సిపాల్ వి.రాజేందర్, అధ్యాపకులు పులి శ్రీనివాస్, నరేశ్ యుగందర్, రాజు, కుమారస్వామి, చైతన్య, సరళ, మానస, రాధిక, సుమతి, మీనా కుమారి, సవిణ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టాస్క్ రీజినల్ మేనేజర్ రామకృష్ణ

ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో ఘర్షణ

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎదుట మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో హనుమకొండ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఓ వ్యక్తి అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌తో గొడవ పడినట్లు తెలిసింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పోలీస్‌స్టేషన్ గేటు ఎదుట ఓ డ్రైవర్ ఆటో ఆపాడు. ఇక్కడెందుకు ఆటో నిలిపావు అని ప్రశ్నించిన కానిస్టేబుల్‌తో పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న వ్యక్తి గొడవ పడినట్లు తెలిసింది. అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై మందలించడంతో గొడవ సద్దుమణిగినట్లు తెలిసింది.

ఫొటో స్టోరీ: కంకర పని.. కక్కుర్తి కాంట్రాక్టర్!



మగవాళ్లకు కూలి రోజుకు వెయ్యి రూపాయలు. ఆడవాళ్లకైతే ఆరొందలు. అదే పిల్లలకు ఎంతిచ్చినా చెల్లుబాటు అవుతుందనుకున్నాడో కాంట్రాక్టర్. చిన్నారుల రెక్కల కష్టానికి రూ.250 వెలకట్టి బంగారు బాల్యాన్ని ఎర్రటి ఎండలో రోడ్డుపై నిలబెట్టాడు. చదువుకోవాల్సిన ఆరుగురు విద్యార్థులతో పనులు చేయిస్తున్నాడు. గంగారం మండలం పెద్దల్లపూర్ సమీపం నుంచి మర్రిగూడెం వరకు రోడ్డు బీటీ వేసేందుకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇటీవల పనులు ప్రారంభించాడు. పెద్దవాళ్లను పనిలో తీసుకుంటే ఎక్కువ కూలి ఇవ్వాల్సి ఉంటుందని బాలలతో పని చేయించుకుంటుండగా.. 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- కొత్తగూడ